♦మినీ కథ

టి.వి.కె.రెడ్డి



# న్యూ జనరేషన్

రాత్రి డిన్నర్ ముగించి అప్పడే హాల్లోకి వచ్చాడు కల్నల్ రంగారావు. వక్కపొడి నోట్లో వేసుకుంటూ కేబుల్ టి.వి ఆన్ చేసాడు.

భార్య పోయిందిగ్గర్నుంచి ఒంటరిగా ఉన్న రావు గారికి పుస్తకాలు, టి.వియే కాలక్షేపం. ఆర్మీలో ఫీల్ట్ పోస్టింగ్‌లో ఉన్నాడు కనుక అప్పడప్పడు ఆర్మీ మెస్‌కి వెళ్ళినా టి.వి పుస్తకాలతో ఉన్నంత సాన్నిహిత్యం మెస్‌తో పెరగలేదు. ప్రస్తుతం రావు గారికి ఈ ప్రపంచంలో ప్రాణానికి ప్రాణం ఎవరన్నా ఉన్నారంటే అది తన పద్దెనిమిదేళ్ళ కూతురు మాధవీ లతే. చిన్నతనంలోనే తల్లికి పోగొట్టుకొన్న మాధవికి తల్లీ, తండ్రి రెండూ తనే అయ్యి అపురూపంగా పెంచాడు. స్కూల్ చదువు వరకు తనతోనే ఉన్నా మెడిసిన్ చదువుతా అని కూతురు పట్టుబట్టడం, తనదేమో రెండేళ్ళకోసారి ట్రాన్సఫర్ అయ్యే ఉద్యోగం కావడంతో ఇష్టం లేకపోయినా మాధవిని సిటీలో హాస్టల్లో ఉంచి చదివిస్తున్నాడు. కాలేజికి సెలవులు కావడంతో తండ్రితో సమయం గడపడానికి వచ్చింది మాధవి.

టి.వి దగ్గర కూర్చుంటూ "అమ్మాయ్ మాధవి" అంటూ కేక వేశారు రావుగారు. వస్తున్నా డేడీ అంటూ వచ్చిన కూతురుతో తను చూస్తున్న ఛానల్ బోర్ అనిపించడంతో ఛానల్ మార్చమన్నారు రావుగారు. నక్షత్రాల టి.విలో ఏదో మంచి ఇంగ్లీషు సినిమా రావడంతో చానల్ అక్కడికి అడ్జస్ట్ చేసి తండ్రి పక్కనే కూర్చుంది మాధవి. కొంచెంసేపు చూసారో లేదో టి.వి స్క్రీన్ మీద అర్ధనగ్న యువతీ యువకులు ప్రత్యక్షమవడంతో ఇబ్బందిగా ఫీల్ అయిన రావుగారు "అమ్మాయ్ కాస్త వంటిల్లు సర్ధిరారా" అన్న వంకతో కూతుర్ని పంపించివేసారు. వంటిల్లు సర్ధి• పది నిమిషాల తర్వాత వచ్చిన కూతురికి టి.వి స్క్రీన్ మీద వేడి దృశ్యాలు మాయమవడంతో కాస్తంత రిలీఫ్‌గా అనిపించింది రావుగారికి. అయితే సినిమా బాగుండడంతో ఛానల్ మారుద్దామన్న ఆలోచనని బలవంతంగా విరమించుకున్నారు రావుగారు.

కూతురు వచ్చి కూర్చొందో లేదో మళ్ళీ టి.విలో ఈసారి మరింత ఘాటైన దృశ్యాలు రావడం మొదలయ్యింది. మాధవీ "బెడ్ రూంలోంచి నా నైట్‌డ్రెస్ తీసుకురా తల్లీ" అంటూ మళ్ళీ పంపారు రావుగారు. అప్పటికీ విషయం అర్ధం చేసుకున్న మాధవి "డేడీ నన్ను అర్ధగంటవరకు మళ్ళీ పిలవకండి లేకపోతే నేను కనీసం ఇంకా రెండు సార్లన్నా లోపలికి వెళ్ళాల్సి ఉంటుంది. ఎందుకంటే ఈ సినిమాని నేను సంవత్సర క్రితమే సిటీలో థియేటర్‌లో ఫ్రెండ్స్‌తో కలిసి చూసాను" అన్న మాధవి వైపు అవాక్కయి చూస్తుండిపోయాడు రావుగారు. ●



**ఎట్టకేలకు...**

బేటా హిందీ సినిమా తర్వాత పెద్దగా పెద్దగా హిట్లులేక అలో లక్ష్మణా అని విలపిస్తున్న అనిల్‌కపూర్‌కు ఎలాగైతే వరసగా రెండు హిట్లు దక్కాయి. జుదాయి తరువాత విడుదలైన విరాసత్ కూడ విజయం సాధించడంతో అతడి ఆనందానికి పట్టపగ్గాల్లేవ్. అయితే రెండు సినిమాల క్రెడిట్ హీరోయిన్లకే దక్కింది. అది వేరే విషయం.

